సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
మంగళవారం 11-3-2025
సంపుటి: 20 సంచిక: 295
పేజీలు: 8 వెల: రూ.1

## పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడమే లక్ష్యం



- ప్రభుత్వం నిర్దేశించిన మెనూ సక్రమంగా అమలుచేయాలి
- రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నాణ్యమైన పోషక విలువలతో కూడిన్న ఆహారాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం శ్రీకాకుళలో మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు (ఎండీయూ) వాహనాన్ని, అంగన్వాడీ కేంద్రాన్ని, ప్రభుత్వం బాలికొన్నత పాఠశాలలు రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు - మిగతా చివరి పేజీలో




# ఈ దారి.. సిక్కోలు అభివృద్ధికి రాదారి

- రాష్ట్రంలో మొదటి ఆరు లైన్ల హైవే మనదే
- అత్యధిక ట్రాఫిక్ ఉండటమే కారణం
- హైవే వల్ల లబ్ధి పొందిన జిల్లా సిక్కోలేనని పేర్కొన్న సర్వేలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**స్వర్ణ చతుర్భుజి.. దేశంలో మౌలిక వసతుల్లో భాగమైన సుదూర రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన పేరు అది. భారతీయ జనతా పార్టీ నేతృత్వ ఎన్డీఏ హయాంలో దేశంలో మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇచ్చిన కాలమది. దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి నాయకత్వంలో రెండోసారి అధికార పగ్గాలు చేపట్టిన ఎన్డీయే కూటమి మౌలిక వస్తువుల రంగానికి పెద్ద పీట వేసింది. ఇందులో భాగంగానే దేశం నలుదిక్కులు కలిసేలా మహా నగరాల మధ్య నాలుగు లైన్ల రహదారుల నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించింది. ఢిల్లీ నుంచి చెన్నైకి, చెన్నై నుంచి కోల్‌కతాకి, కోల్‌కతా నుంచి ముంబైకి, ముంబై నుంచి ఢిల్లీకి.. ఇలా నాలుగు నగరాలు కలిపితే స్వర్ణ చతుర్భుజి అనే గొప్ప ఆలోచనకి నాటి దార్శనికుడు వాజ్‌పేయి అంకురార్పణ చేశారు.**

దేశంలోని నాలుగు మహా నగరాలను కలుపుతూ, 5846 కిలోమీటర్ల పరిధిలో నాలుగు లైన్ల నిర్మాణం ప్రారంభమైంది. మొదటి అడుగు మాత్రం చెన్నై–హౌరా మధ్య రోడ్డుతోనే సాగింది. 1661 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రెండు లైన్ల మధ్య పూర్తిస్థాయిలో నాలుగు లైన్ల నిర్మాణం పూర్తి కావడానికి దాదాపు ఆరు సంవత్సరాలు పట్టింది. దీంతో అంతవరకు ఎప్పుడూ కనివిని ఎరుగని అద్భుతమైన రహదారి మీద ప్రయాణించే అవకాశం మనందరికీ దక్కింది. ఈ స్వర్ణ చతుర్భుజి వలన వాహనాల వేగం పెరిగింది. దూరం తగ్గకపోయినా ప్రయాణించే సమయం తగ్గింది. ఈరోజు విశాఖపట్నం నుంచి శ్రీకాకుళానికి ప్రతిరోజు విద్యార్థులు, ఉద్యోగులు షటిల్ చేస్తున్నారు అంటే అది హైవేల నిర్మాణం గొప్పతనమే అని చెప్పక తప్పదు. ఒక్క మాటలో చెప్పాలంటే అటల్ కలలకు ప్రతిరూపం. అప్పట్లో ప్రాజెక్టు పూర్తి చేయడానికి రూ.50వేల కోట్లు అవుతాయని అంచనా వేశారు. అంత డబ్బులా..? అని అధికార యంత్రాంగం వెనకడుగు వేసింది. కానీ వాజ్‌పేయి తెగించి ముందడుగు వేశారు. ఫలితంగా భారతదేశ పురోగమనంలో నాలుగు లైన్ల రోడ్ల నిర్మాణం ఒక మేలిమలుపుగా మిగిలింది. ఆ తర్వాత 2015 నుంచి సిక్స్‌లైన్ నిర్మాణం ప్రారంభమైంది. దీనితో దేశ మౌలిక వసతుల రంగంలో మరో అంకం మొదలైంది. ఈ ప్రాజెక్టు వల్ల ఎక్కువగా లబ్ధి పొందింది మాత్రం శ్రీకాకుళం జిల్లావాసులు. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. వరల్డ్ బ్యాంకు నాలుగు లైన్ల రోడ్ల నిర్మాణం మీద ఇచ్చిన ఒక రిపోర్ట్‌లో జాతీయ రహదారుల విస్తరణ వల్ల సిక్కోలుకు జరిగిన మేలుని వివరించింది. సుదీర్ఘమైన జాతీయ రహదారి మనకు వరం. ఇచ్ఛాపురం నుంచి పైడిభీమవరం వరకు ఉన్న జాతీయ రహదారి ప్రాంతమంతా విశేషంగా అభివృద్ధి చెందింది. నాలుగు లైన్ల నిర్మాణం పూర్తయిన రెండు దశాబ్దాలలో శ్రీకాకుళం జిల్లాలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. జాతీయ రహదారి ప్రాంతమంతా వ్యాపార వ్యవహారాలకు వేదికగా మారింది. జాతీయ రహదారికి రెండువైపులా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు వచ్చాయి. పరిశ్రమలు పెరిగాయి. 3 స్టార్ హోటళ్లు వెలిశాయి. కాకా హోటళ్లు ప్రతి అడుక్కి పుట్టుకొచ్చాయి. భూముల విలువ పెరిగింది. ఎకరా లక్ష - మిగతా చివరి పేజీలో

# జగన్‌కు ప్రతిపక్ష హోదా వస్తుందా?



**ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో ప్రతిపక్ష హోదా అంశం హాట్ టాపిక్‌గా మారింది. తనకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి హాజరవుతానని వైకాపా అధినేత జగన్ అంటుంటే, 10 శాతం సీట్లు లేవు కాబట్టి ప్రతిపక్ష హోదా ఇచ్చేది లేదని స్పీకర్ తెగేసి చెపుతున్నారు. మరి ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పడేది ఎప్పుడు? ఈ విషయంలో కోర్టు మెట్లు ఎక్కినా శాసనసభ స్పీకర్ విచక్షణ పరిధిలోని అంశంలో కోర్టులు ఏం తేలుస్తాయన్నది అందరికీ సందేహమే.**

అభియోగాలు, బెదిరింపులతో గత జూన్‌లో జగన్ తనకు లేఖ రాశారని ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. నాడు లోక్‌సభలో ఉపేంద్రకు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చారని చెప్పటంలో వాస్తవం లేదన్నారు. నాడు టీడీపీ గ్రూపు నేతగానే ఉపేంద్ర వ్యవహరించారని చెప్పుకొచ్చారు. జగన్ తనకు ప్రతిపక్ష నేతగా అవకాశం ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టుకు వెళ్లారని వివరించారు. జగన్ పిటీషన్‌ను విచారణ చేయాలా వద్దానే దశలోనే ఆ పిటీషన్ ఉందని చెప్పారు.

ఈ సందర్భంగా స్పీకర్ సభలో కీలక రూలింగ్ ఇచ్చారు. మాజీ సీఎం జగన్ తనకు సభలో ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలంటూ చేస్తున్న డిమాండ్ సరికాదన్నారు. అసెంబ్లీ నిబంధనల ప్రకారం 10 శాతం సీట్లు సాధించిన పార్టీకే ప్రతిపక్ష హోదా దక్కుతుందని తేల్చి చెప్పారు. నాడు ముఖ్యమంత్రి హోదాలో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబుకు 18 సీట్లు, ప్రతిపక్ష హోదా లేకుండా చేయగలనని చేసిన వ్యాఖ్యలను గుర్తుచేశారు. ప్రతిపక్ష హోదాపై జగన్ అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### రాజ్యాంగంలో 10 శాతం నిబంధన ఉందా?

భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 168 నుంచి 221 వరకూ రాష్ట్రాల శాసనసభలు, మండళ్ల నిర్వహణ, విధుల గురించి ప్రస్తావించారు. ఏదైనా చట్టసభలో అధికార పార్టీ, లేదా అధికార కూటమిలో ఉండే పార్టీల తర్వాత పెద్ద పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కుతుంది. నిజానికి 1977 వరకు ప్రధాన ప్రతిపక్ష హోదా సమస్య రాలేదు. ఇంతకు ముందు, లీడర్ ఆఫ్ అపోజిషన్ అనే వివాదమే లేదు. రెండో పెద్ద పార్టీకి గుర్తింపు ఇచ్చేవారు. కానీ, మొదటిసారి 1977లో కాంగ్రెస్ ఓటమి తర్వాత లీడర్ ఆఫ్ అపోజిషన్ పోస్టుకి చట్టబద్ధత కల్పించారు. రాజ్యాంగం ప్రకారం ప్రతిపక్ష హోదాపై ఎలాంటి నిబంధనలు లేవు.

అయితే, 1977లో రూపొందించిన నిబంధనల ప్రకారం పార్లమెంట్/ శాసనసభలో ప్రధాన ప్రతిపక్ష హోదా కలిగిన పార్టీ నేతకు కొన్ని సదుపాయాలు కల్పించారు. వాటి ప్రకారం, ప్రధాన పార్టీగా గుర్తింపు దక్కాలంటే సభలో ఆ పార్టీకి కనీసం 10 శాతం సభ్యులుండాలి. లేకుంటే పార్టీగా కాకుండా గ్రూపుగా మాత్రమే గుర్తిస్తారు. ఈ మేరకు లోక్‌సభలో 55, రాష్ట్ర అసెంబ్లీలో 18 సీట్లు దక్కిన పార్టీలకే ప్రధాన ప్రతిపక్ష హోదా లభిస్తుంది. నిర్ణీత సంఖ్యలో సీట్లు దక్కిన పార్టీ నాయకుడిని ప్రధాన ప్రతిపక్ష నేతగా స్పీకర్ ప్రకటిస్తారు. అయితే, 10 శాతం సీట్లు రావాలన్నది రాజ్యాంగంలో లేదని, పది శాతం సీట్లు అనే నిబంధన మధ్యలో తీసుకువచ్చిందనే వాదన సాగుతోంది. ప్రతిపక్ష నేతగా కొన్ని సౌకర్యాలను ప్రభుత్వ పరంగా అందించడానికే 10 శాతం సీట్ల నిబంధన తెచ్చారంటున్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం అమలైన తర్వాత ఆ 10 శాతం నిబంధన కూడా పోయిందని కొందరు నిపుణులు చెబుతున్నారు.

### ప్రధాన ప్రతిపక్ష హోదా ఉంటే..

ప్రధాన ప్రతిపక్ష హోదా ఉంటే ప్రధాన ప్రతిపక్ష నేతకు క్యాబినెట్ మంత్రి హోదా ఉంటుంది. సభలో సీట్ల కేటాయింపులో విపక్షానికి ప్రాధాన్యం దక్కుతుంది. పీఎస్, పీఏ సహా సిబ్బంది, అలవెన్సులతో పాటు ప్రోటోకాల్ కూడా వర్తిస్తుంది. సభలో చర్చల సందర్భంగా స్పీకర్ అనేక సందర్భాల్లో ప్రధాన ప్రతిపక్ష నేతను సంప్రదించడం ఆనవాయితీ. సభలో ప్రశ్నలు వేసే విషయంలో కూడా ప్రాధాన్యం ఉంటుంది. సభలో మాట్లాడడానికి సమయం సభా నాయకుడితో సమానంగా ఉంటుంది. కాబట్టే జగన్ ప్రతిపక్ష హోదా కోసం పట్టబడుతున్నారు.

16, 17 లోక్‌సభల్లో కూడా వరుసగా కాంగ్రెస్ పార్టీ ప్రధాన ప్రతిపక్ష హోదాకు దూరంగా నిలిచిపోయింది. 2014లో కేవలం 44 సీట్లు, 2019లో 52 స్థానాలకే ఆ పార్టీ పరిమితమైంది. దాంతో ప్రధాన ప్రతిపక్ష హోదా కోసం సుప్రీం కోర్టుని ఆశ్రయించింది. అయితే, స్పీకర్ అధికారాల్లో తాము జోక్యం చేసుకోలేమని కాంగ్రెస్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దీంతో లోక్‌సభలో రెండో పెద్ద పార్టీ అయినప్పటికీ కాంగ్రెస్‌కు ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కలేదు.

1984 లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలుగుదేశం పార్టీ అప్పట్లో కాంగ్రెస్ తర్వాత రెండో పెద్ద పార్టీగా నిలిచినప్పటికీ ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కలేదు. అయితే ఢిల్లీ అసెంబ్లీలో 70 స్థానాలకు గాను ఆప్‌కు 67 స్థానాలు, బీజేపీకి కేవలం 3 సీట్లు వచ్చాయి. అయినా స్పీకర్ బీజేపీకి ప్రతిపక్ష హోదా ఇచ్చారు. అదే విషయాన్ని ఇప్పుడు జగన్ పదే పదే గుర్తుచేస్తున్నారు. రాజ్యాంగంలో ఎక్కడా పది శాతం నిబంధన లేదని వాదిస్తూ వస్తున్నారు.

2024 ఎన్నికల్లో ఏపీ అసెంబ్లీలో తెలుగుదేశం పార్టీకి 135, జనసేనకి 21, వైకాపాకు 11, బీజేపీకి 8 స్థానాల చొప్పున దక్కాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా బరిలోకి దిగడంతో పాటు, ప్రభుత్వంలోనూ భాగస్వాములుగా ఉన్నాయి. కాగా, 11 స్థానాలు మాత్రమే గెలుచుకున్న వైకాపా ప్రతిపక్షం అవుతుంది. అయితే, అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష స్థానం దక్కాలంటే ఆ పార్టీకి కనీసం 18 మంది ఎమ్మెల్యేల బలం ఉండాలంటున్నారు. ఇప్పుడు జగన్‌కు ప్రతిపక్ష హోదా అడిగే నైతిక హక్కు లేదని, గతంలో అధికారంలో ఉన్నప్పుడు శాసనసభలోనే చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా లేకుండా చేస్తానని బెదిరించిన విషయం గుర్తు తెచ్చుకోవాలంటున్నారు. ఏదైనా జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వాలా లేదా అన్నది మాత్రం స్పీకర్ విచక్షణ మీదే ఆధారపడి ఉంది. జగన్‌ను అసెంబ్లీకి రప్పించి సభలో అవమానించడానికైనా అధికార పక్షం ప్రతిపక్ష హోదా ఇస్తుందని కొందరు వాదిస్తున్నా, జగన్ మాత్రం అసెంబ్లీకి రాకుండా ఉండేందుకే నిర్ణయించుకున్నట్టుగా కనిపిస్తోంది.

- బాలకృష్ణ ఎం, సీనియర్ జర్నలిస్ట్

## శిష్టకరణాల అభ్యున్నతికి కట్టుబడివున్నాం

కొత్త అధ్యక్షుడ్ని సన్మానించిన మంత్రి అచ్చెన్నాయుడు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలో శిష్టకరణాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కొత్తగా ఎన్నికైన ఆలిండియా శిష్టకరణ సంఘ అధ్యక్షుడు అక్కుమహంతి రాజాను మంత్రి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కొత్త కార్యవర్గానికి కూటమి ప్రభుత్వం పూర్తి మద్దతు, సహాయ సహకారాలు ఉంటాయని స్పష్టం చేశారు. ఇంతవరకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో శిష్టకరణ సంఘాల తరపున ఆలిండియా స్థాయిలో సంఘాన్ని నడపగల నాయకత్వం రాలేదని, ఇప్పుడు కొత్త సంఘానికి తమ మద్దతు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అంతకు ముందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శిష్టకరణ సంక్షేమ సంఘం 63/79 నూతన కార్యవర్గం బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితను, ఆబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అక్కుమహంతి రాజాను వారు కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మానాపురం గౌరీశంకర్, బలివాడ సత్యారావు పట్నాయిక్, బద్రిమహంతి వెంకటరావు, శేఖరమహంతి శ్రీనివాస్, వీనం శ్రీనివాస్, శ్యామ్‌సుందర్, కవిత తదితరులు పాల్గొన్నారు.

**జీవితం అదే.. స్క్రిప్ట్ మాత్రం ఎవడిది వాడిదే!**



- చివరి పేజీలో

• ఎడిటోరియల్

# జై షా లాంటివారి అవసరం ఉంది

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 విజేత భారత్. రెండేళ్లలో రెండు ఐసీసీ కప్‌లు భారత్‌కి అందించి నందుకు కెప్టెన్ రోహిత్ శర్మకి అభినందనలు. ఐసీసీ సీటీ 2025ని పాకిస్థాన్‌లో నిర్వహించడం తప్పనిసరి అయినా జై షా చాకచక్యంగా వ్యవహరించి పాకిస్థాన్‌ని ఎక్కడ పెట్టాలో అక్కడ పెట్టాడు. ఐసీసీకి ఛైర్మన్‌గా ఎవరు ఉన్నా బీసీసీఐ మాట వినాల్సిందే. 18,300 కోట్ల విలువ ఉన్న బీసీసీఐ మాటని ఏ దేశం కూడా కాదనలేదు. క్రీడల మేనేజ్మెంట్ అనేది ఇప్పుడు ఒక ప్రొఫెషన్. స్పోర్ట్స్ మేనేజ్మెంట్‌లో ముఖ్యంగా క్రికెట్‌లో భారత్ రోల్ మోడల్‌గా ఉండిపోయింది. మరి అత్యంత ధనవంతమైన బీసీసీఐకి జై షా లాంటి వారి అవసరం ఉండి తీరాలి. ఛాంపియన్స్ ట్రోఫీని పాకిస్థాన్‌లో నిర్వహిస్తే భారత జట్టు పాకిస్తాన్ వెళ్లదు అన్నాడు జై షా. పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకేమో ఛాంపియన్స్ ట్రోఫీ తమ దేశంలో నిర్వహించకపోతే ఇప్పటికే కష్టాలలో ఉన్న బోర్డు మరింత కష్టాలలోకి వెళ్లిపోతుంది. ఛాంపియన్స్ ట్రోఫీ పాకిస్థాన్‌లో జరిగితే టికెట్ల ద్వారా ఆదాయం వచ్చి కొంతలో కొంత అన్నా కోలుకోవచ్చు అనే ఆశ పాక్ బోర్డుకి ఉందని తెలిసే జై షా మైండ్ గేమ్ ఆడాడు. భారత్ కనుక పాకిస్థాన్‌లో ఆడకపోతే భారత్ లేకుండానే టోర్నమెంట్ నిర్వహిస్తామని మియాందాద్ లాంటి వాళ్లు మాటల యుద్ధానికి తెరతీశారు. జై షా చాలా నిశ్శబ్దంగా పని చేసుకుపోయాడు. పాకిస్థాన్‌లో కాకపోతే న్యూట్రల్ వేదిక మీద టోర్నమెంట్ జరుగుతుందని సందేశం వెళ్లింది పాకిస్తాన్ క్రికెట్ బోర్డుకి. భారత్ ఆడే మ్యాచ్‌లు అన్నీ దుబాయ్‌లో జరిగేట్లుగా ఒప్పుకుంటే మిగతా మ్యాచ్‌లు పాకిస్థాన్‌లో జరిగేట్లుగా పాకిస్తాన్ ఒప్పుకుంది. ఐసీసీ నుంచి 1800 కోట్లు పాకిస్తాన్‌కి వెళ్లాయి అదీ ఆలస్యంగా. 1180 కోట్లు ఖర్చు పెట్టి స్టేడియంలు బాగుచేసింది పాకిస్తాన్ క్రికెట్ బోర్డు. ఇచ్చిన ఎస్టిమేషన్ 1200 కోట్లు అయితే, అందులో స్టేడియంలో కుర్చీలు కొత్తవి ఫిక్స్ చేస్తామని చెప్పి విరిగిపోయిన కుర్చీల స్థానంలో కొత్తవి బిగించి పాతవి అలానే ఉంచి హాట్ బ్లోయర్స్‌తో వేడి చేసి తళతళలాడేట్లు చేసింది. అంటే ఇచ్చిన ఎస్టిమేషన్‌లో ఎంతో కొంత నొక్కేయాలానే ప్లాన్ అన్నమాట. కానీ స్టేడియంలోకి ఎవరూ రాకుండా ఆపలేకపోవడంతో పాకిస్తాన్ యువకులు మొబైల్‌తో వీడియో తీసి వైరల్ చేశారు. చాలా కాలం తర్వాత ఐసీసీ ఈవెంట్ జరుగుతుండడంతో చాలా సంబరపడిపోయారు పాకిస్తాన్ క్రికెట్ ప్రేమికులు. తీరా టోర్నమెంట్ మొదలైన తర్వాత స్టేడియంలు ఖాళీగా కనిపించాయి. టికెట్ కొని క్రికెట్ మ్యాచ్ చూసే స్థోమత పాకిస్తాన్ ప్రజలకి లేదు. పోనీ తమ జట్టు ఏవన్నా బాగా ఆడితే వెళ్లేవాళ్లు ఏమో. సెమిస్‌కి రాకుండానే బయటికి వెళ్లిపోయింది పాకిస్తాన్. జై షా వ్యూహం ఏమిటో భారత్ సెమీ ఫైనల్ గెలిచిన తర్వాత కానీ అర్థం కాలేదు. పాకిస్థాన్‌లో జరిగిన అన్ని మ్యాచ్‌లు భారీ స్కోర్ నమోదయ్యాయి. అదే దుబాయ్‌కి వచ్చేసరికి మందకొడి పిచ్‌లతో అటు బ్యాటింగ్‌కి కానీ, ఇటు బౌలింగ్‌కి కానీ సహకరించలేదు. భారత్ ఆడిన మ్యాచ్‌లన్నీ ఒకే స్టేడియంలో కాస్త అటు ఇటుగా ఉన్న రెండు పిచ్‌ల మీద ఆడింది. దుబాయ్ స్టేడియంలో మొత్తం మూడు పిచ్‌లని సిద్ధం చేయించాడు జై షా. పిచ్ క్యూరేటర్‌గా ఆస్ట్రేలియా నుంచి పిలిపించారు. సెమీ ఫైనల్‌కి ముందు జరిగిన మ్యాచ్‌లు అన్ని ఒకే పిచ్ మీద ఆడారు. సెమీ ఫైనల్, ఫైనల్ ఒకే పిచ్ మీద ఆడారు. ఆస్ట్రేలియా గడాఫీ స్టేడియంలో భారీ స్కోర్ చేసి దుబాయ్‌కి వచ్చి విఫలం అయ్యింది. న్యూజిలాండ్‌ది కూడా అదే పరిస్థితి. ఈ రోజు ఫైనల్ మ్యాచ్ చూస్తే ఫాస్ట్ బౌలర్స్ లైన్ అండ్ లెంగ్త్ కరెక్ట్‌గా బౌల్ చేసినవి బ్యాటర్స్ ఆడలేకపోయారు. బాల్ ఏమాత్రం లైన్ తప్పినా వైడ్ బాల్‌గా వెళ్లిపోయాయి. ఫుల్ లెంగ్త్ బాల్‌లు బౌండరి, సిక్స్‌లుగా వెళ్లిపోయాయి. బాల్ ఏ మాత్రం ఒక అంగుళం లెఫ్ట్ సైడ్ పిచ్ అయినా ఆఫ్ సైడ్ వైడ్ బాల్‌గా వెళ్లిపోయాయి. బాల్ ఏ మాత్రం కుడివైపు ఆగులం పిచ్ అయినా లెగ్ సైడ్ వైడ్ బాల్‌గా వెళ్లిపోయాయి. ఇరు జట్లు 8 వైడ్ బాల్స్ రూపంలో అదనపు పరుగులు ఇచ్చాయి. మొహమ్మద్ షమికి అది డెడ్ పిచ్‌తో సమానం. కాబట్టి షమిని ఏమీ అనడానికి వీలు లేదు. ఉదయం నెట్ ప్రాక్టీస్‌లో కోహ్లీకి గాయమయింది. అందుకనే రోహిత్ ఆచి తూచి ఆడాడు. ఇక ఎప్పటి లాగానే శ్రేయస్ అయ్యర్, కేఐ రాహుల్‌లు మిడిల్ ఆర్డర్‌లో తాము ఎంత ముఖ్యమైన ఆటగాళ్లమో మరోసారి నిరూపించుకున్నారు. ఈరోజు భారత్ నలుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగి విజయం సాధించింది. రోహిత్ శర్మ ఫ్లైయింగ్ స్టార్ట్ అనేది మ్యాచ్ విన్నింగ్ పాయింట్. ముఖ్యంగా రోహిత్ ముందుకు వచ్చి కొట్టిన సిక్సర్ 96 మీటర్ల దూరం వెళ్లడం చూస్తే రోహిత్ శర్మ ఇంకో సంవత్సరం ఆడగలడు అనిపించింది. అఫ్కోర్స్.. మ్యాచ్ మొదలువ్వక ముందే గౌతమ్ గంభీర్ వచ్చే టీ-20 వరల్డ్ కప్‌లో కూడా రోహిత్ ఆడతాను అంటే.. నాకేమి అభ్యంతరం లేదని ప్రకటించాడు. చాంపియన్స్ ట్రోఫీకి ఆతిధ్యం ఇచ్చిన పాకిస్థాన్‌లో సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్ జరగకుండా చేయడం ఏదైతే ఉందో దాని క్రెడిట్ జై షాకి ఇవ్వాల్సిందే. భారత జట్టు కనుక పాకిస్థాన్ వెళ్లి ఉంటే జయాపజయాల సంగతి ఎలా ఉన్నా కింగ్ కోహ్లీని చూడడానికి టికెట్స్ కొని మరీ స్టేడియంకి వచ్చే వాళ్లు పాకిస్తాన్ ప్రజలు. కోహ్లీకి పాకిస్తాన్‌లో ఉన్న ఆదరణ మన దేశంలో కంటే ఎక్కువే. పాకిస్థాన్ జెర్సీలు ధరించి వెనక కోహ్లీ పేరు ప్రింట్ చేయించుకుని మరి దుబాయ్ స్టేడియంకి వచ్చారు పాకిస్తాన్ యువతీ యువకులు సెమీఫైనల్ మ్యాచ్‌కి. అదీ కోహ్లీకి పాకిస్థాన్‌లో ఉన్న క్రేజ్! దుబాయ్‌లో క్రికెట్ మ్యాచ్ అంటే ఒకప్పుడు భారత్ ఆడే మ్యాచ్ మీద ఆశ వదులుకునేవాళ్లు. దుబాయ్‌లో మ్యాచ్.. అంటే అది పాకిస్తాన్‌కి ఫిక్స్ అయిపోయినట్లే ఒకప్పుడు. ఇప్పుడు? మ్యాచ్ ఫిక్సింగ్ లేదు. దావూద్ తరపున వీఐపీ బాక్స్‌లో బుకీలు కనిపించడం లేదు!

# యువత పోరుకు తరలిరండి

**(సత్యంన్యూస్, పొందూరు)**

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా హెడ్‌క్వార్టర్‌లో యువత పోరు కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, వైకాపా యువ నాయకులు, నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు ఈనెల 12న జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అనంతరం ఫీజుపోరు పోస్టర్‌ను పొందూరు పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి సత్యన్నారాయణ, పార్టీ కళింగ సామాజిక వర్గ రాష్ట్ర అధ్యక్షులు దుంపల రామారావు (లక్ష్మణరావు), పొందూరు మండలం వైసీపీ అధ్యక్షులు పప్పల రమేష్‌లు పాల్గొన్నారు.



# ఫీజు పోరుకు.. రండి..తరలి రండి



**(సత్యంన్యూస్, టెక్కలి)**

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా హెడ్‌క్వార్టర్‌లో యువతపోరు కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, వైకాపా యువ నాయకులు, నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు ఈనెల 12న జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమానికి టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అనంతరం టెక్కలి నియోజకవర్గ యువజన అధ్యక్షులు చిన్ని జోగారావు యాదవ్, నందిగాం మండల యువజన అధ్యక్షుడు కణితి గిరి, నాయకులు కాంచరాన శ్రీధర్, కణితి క్రాంతి కుమార్, ఎరుమాక సోమేసు,దట్టి శాంతారావు, బతకల వెంకట్ తదితరులు ఫీజుపోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు.

# బెడ్‌సైట్ అసిస్టెంట్ కోర్స్ ప్రారంభం

సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలలో భాగంగా శ్రీ సత్యసాయి సేవాసంస్థల రాష్ట్ర అధ్యక్షులు రఘుపాత్రుని లక్ష్మణరావు మంగళవారం పట్టణం శ్రీసత్యసాయి సేవా సమితి సాయి బృందావనం బ్యాంకర్స్ కాలనీ మందిరంలో వయోవృద్ధులకు సేవలందించే బెడ్‌సైట్ అసిస్టెంట్ కోర్స్ అనే ప్రత్యేకమైన శిక్షణ కోర్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ ఈ కోర్సు ఒక ప్రత్యేకమైన సేవా దృక్పథంతో కూడుకున్న కోర్స్ అని, ఇది మన రాష్ట్రంలో మొట్టమొదటిదని, భారతదేశంలో రెండవ శిక్షణ కేంద్రం అని తెలియజేస్తూ శ్రీ సత్యసాయి స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఆంధ్ర రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌తో ఎంఓయూ కుదుర్చుకొని ఈ శిక్షణ కోర్సును ప్రారంభించామన్నారు. ఈ శిక్షణ ఆరు నెలలు రెసిడెన్షియల్‌గా ఉంటుందని, దీనికి ఓరల్ క్లాసులు లేబరేటరీ ద్వారా ప్రాక్టికల్స్ కూడా చేయిస్తామన్నారు. కోర్సు పూర్తయిన తర్వాత స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారే సర్టిఫికెట్ ఇస్తారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకు మంచి అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు.కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఇంచార్జ్ బోయిన నరసింహమూర్తి, జిల్లా సేవా సమన్వయకర్త పప్పల నాగేశ్వరరావు, ప్రోగ్రాం ఇంచార్జ్ డాక్టర్ మాలతి సీనియర్ మోస్ట్ గైనకాలజిస్ట్ సింధూర నర్సింగ్ హెూమ్, కోర్స్ డైరెక్టర్‌లు నిమ్మి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ నర్సింగ్ కాలేజీ పుట్టపర్తి, కైలాసరావు రిటైర్డ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, మందిరం కన్వీనర్ అల్లాడ ప్రసాదరావు, మురళీ ,ప్రమీల, సుజాత పాల్గొన్నారు'





నిత్యఅన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమంలో 407వ రోజున ఆముదాలవలసలో కుశమంచి శ్యాంప్రసాద్, మాలతి దంపతులు (శ్రీకృష్ణ టెక్స్‌టైల్స్) పెళ్లిరోజు సందర్భంగా వారి కుటుంబసభ్యులు 35 మందికి అన్నదానం, మజ్జిగ బాటిల్ పంపిణీ చేశారు.

**- సత్యంన్యూస్, ఆమదాలవలస**



ఈనెల 12న శ్రీకాకుళంలో వైకాపా ఆధ్వర్యంలో జరగబోయే యువతపోరు పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ఎల్.ఎన్.పేటలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **- సత్యంన్యూస్, పాతపట్నం**




హర్షవల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వావిలపల్లి జగన్నాథ నాయుడును లయన్స్ ఇంటర్నేషనల్ 316ఏ గవర్నర్ పివిడి ప్రసాద్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఫిన్లాండ్ లయన్స్ పిన్‌ను బహుకరించారు.

**- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

## జయంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ఈనెల 12న నిర్వహించనున్న కళింగ ఆశాజ్యోతి స్వర్గీయ బొడ్డేపల్లి రాజగోపాలరావు జయంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సమితి ప్రతినిధులు కోరారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జయంతి సందర్భంగా 7రోడ్ల జంక్షన్, కిమ్స్ హాస్పిటల్, కుశాలపురం బైపాస్, సింహద్వారం దగ్గర, కొత్తరోడ్డులో గల విగ్రహాలకు బుధవారం ఉదయం 9 గంటలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని వారు కోరారు.



# షూటింగ్‌లో అగ్నికి ఆహుతైన కెమెరామేన్!

సినిమాకు కీలకం కెమేరా. సెల్యులాయిడ్ మీద ఒక కథ పండాలంటే ప్రతిభావంతుడైన కెమేరామెన్ కావాలి. దర్శకుడి ఆలోచనలను ఆకళింపు చేసుకుని వాటిని మరింత ప్రతిభావంతంగా తెరమీద చూపించడమే కెమేరామెన్ బాధ్యత. ఈ క్రమం సక్రమంగా జరిగినప్పుడే సినిమా ప్రేక్షకులను అలరించగలుగుతుంది. అలాంటి ప్రతిభావంతుడైన కెమేరామెన్ లోక్‌సింగ్. ప్రతిభతో పాటు విపరీతమైన అంకితభావం ఉన్న కెమేరామెన్ లోక్ సింగ్. లోక్ సింగ్ అనే పేరు వినగానే చాలా మంది ఇతను ఉత్తర భారతదేశం నుంచి వచ్చాడనుకుంటారు.కానీ లోక్ సింగ్ పుట్టిందీ పెరిగిందీ అంతా చెన్నైలోనే. ఇంట్లో సినిమా వాతావరణం ఉంది. లోక్ సింగ్ ఎవరో కాదు.. ప్రఖ్యాత దర్శకుడు ఎ.భీమ్ సింగ్ అన్నగారు హుకుం సింగ్ కుమారుడు. భీంసింగ్ రెండో కొడుకు కన్నన్ కూడా సినిమాటోగ్రాఫరే. భారతీరాజా సినిమాలకు పనిచేసేవాడు. ఎన్.టి.ఆర్‌తో 'ధనమా దైవమా?' 'బంగారు మనిషి' లాంటి సక్సస్ ఫుల్ సినిమాలు తీసిన భీంసింగ్ 'కరుణామయుడు' చిత్రం తీస్తూ మధ్యలో కన్నుమూశారు. గ్రేట్ డైరక్టర్ భీం సింగ్ మూలంగా లోక్ సింగ్‌కు చిన్నతనంలోనే సినిమా అలవడింది. ప్రస్తుత ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్‌తో కలసి చెన్నై కేసరి హైస్కూల్‌లో చదువుకున్నాడు.

సినిమా రంగంలో కెమేరా అనేది సుప్రీం అనే విషయం చిన్న వయసులోనే లోక్‌సింగ్‌కు అర్థమై పోయింది. తన జీవితం ఆ దిశగా సాగించాలని నిర్ణయించుకున్నాడు.ఆనాటి ప్రముఖ కెమేరామెన్ కె.ఎస్.ప్రసాద్ దగ్గర పనిలో చేరిపోయాడు. కె.వి.రెడ్డి స్వంత సినిమా 'పెళ్లినాటి ప్రమాణాలు' తదితర చిత్రాలకూ కెమేరామెన్ ప్రసాదే. కె.ఎస్.ప్రసాద్ దగ్గర పనిచేస్తూనే నెమ్మదిగా 'ఇషాన్ ఆర్య' టీమ్ తో చేరిపోయాడు లోక్ సింగ్. ఇషాన్ దగ్గర పనిచేసిన 'బాబా అజ్మీ' దగ్గర ఆపరేటివ్ కెమేరామెన్ గాను..స్పెషల్ ఎఫెక్ట్స్ కోసమూ చేరాడు. అలా బాబా అజ్మీ సారథ్యంలో వచ్చిన 'రాజాధిరాజు' కు ఆపరేటివ్ కెమేరామెన్ గా పనిచేశాడు. అలాగే ఆ సినిమాకు స్పెషల్ ఎఫెక్ట్స్ చేసిన 'రవినగాయిచ్' ప్రేరణతో బాపు దగ్గరున్న Fantasy locations పుస్తకాలలోంచి నల్లగా ఉండే చోట్ల మాస్క్ చేసి నూతన్ ప్రసాదూ, విజయచందరూ అక్కడ నడుస్తూన్నట్టు అద్భుత మాయాజాలం చేశాడు లోక్‌సింగ్. ఆ తర్వాత వచ్చిన బాపుగారి 'త్యాగయ్య'లోనూ స్పెషల్ ఎఫెక్ట్స్ అన్నీ లోక్ సింగ్ చేసినవే. ఇలా ఉండగా అల్లు అరవింద్‌తో ఉన్న సాన్నిహిత్యం వల్ల కె.విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన 'శుభలేఖ'కు పూర్తిస్థాయిలో కెమేరామెన్ అయ్యాడు లోక్‌సింగ్. చిరంజీవిని అంతవరకు ఎవరూ చూపించనంత అందంగా చూపించాడు. ముఖ్యంగా సినిమా ప్రారంభంలో వచ్చే ఎడ్వర్టైజ్మెంట్ సాంగ్‌లో అయితే చిరంజీవి చాలా కొత్తగా అనిపిస్తాడు. చెన్నైలో తన ఖాళీ సమయాలన్నీ ఎక్కువగా అల్లు అరవింద్ కార్యాలయంలోనే గడిపేవాడు లోక్ సింగ్. అల్లు అరవింద్ ద్వారా చిరంజీవితోనూ పరిచయం అయ్యింది. 'శుభలేఖ' తర్వాత చిరంజీవితో హాలీవుడ్ రేంజ్ యాక్షన్ ఫిలిం చేశారు అరవింద్. రాజ్ భరత్ డైరక్ట్ చేసిన ఆ మూవీ పేరు 'యమకింకరుడు'. సినిమాటోగ్రాఫర్‌గా లోక్ సింగ్ ప్రేక్షకులకు బాగా రిజిష్టర్ అయ్యింది కూడా ఆ సినిమాతోనే.

'యమకింకరుడు' సినిమా మ్యాడ్‌మాక్స్‌కు రీమేక్. అయితేనేం లోక్‌సింగ్, రాజ్ భరత్, చిరంజీవి కల్సి టాలీవుడ్ ప్రేక్షకులకు కొత్త అనుభూతి కలిగించగలిగారు. యాక్షన్ హీరోగా చిరంజీవి ఢంకా బజాయించింది ఆ సినిమాతోనే. ఆ సినిమా లో చిరంజీవి ఎంట్రన్స్ సీనే చాలా అద్భుతంగా డిజైన్ చేశారు రాజ్ భరత్, లోక్ సింగులు. బాపు డైరక్షన్‌లో చిరంజీవి హీరోగా సినిమా అనౌన్స్ చేశారు జయకృష్ణ. సినిమా పేరు 'మంత్రిగారి వియ్యంకుడు'. బాపు దగ్గర అప్పటికే స్పెషల్ ఎఫెక్ట్స్ చేసి ఉన్న లోక్ సింగ్ రెచ్చిపోయాడు. 'మంత్రిగారి వియ్యంకుడు'లో ఫైట్స్ ను కూడా డాన్సులంత సొగసుగా తీర్చిదిద్దారు చిరంజీవి, లోక్‌సింగులు. ఈ ఫైట్స్ ను మాంటేజ్ చేస్తూ ఓ సూపర్ సాంగ్ పెట్టారు బాపుగారు. 'ఏమనినే పాడెదనో' అంటూ వచ్చే ఆ పాట లోక్ సింగ్ కెమేరా పనితనం ఎంత అద్భుతంగా ఉంటుందో చెప్తుంది. యమకింకరుడు, మంత్రిగారి వియ్యంకుడు మధ్యలో చిరంజీవి తోనే మరో సూపర్ సినిమా కు పనిచేశారు లోక్ సింగ్. ఆ తర్వాత ఓ సెన్సేషనల్ కాంబినేషన్ కు దారి తీసిన ఆ సినిమా పేరు 'అభిలాష'. క్రియేటివ్ కమర్షియల్స్ బ్యానర్‌లో 'ఎర్రగులాబీలు', 'టిక్‌టిక్‌టిక్' లాంటి సినిమాల తర్వాత వచ్చిన తొలి స్ట్రెయిట్ చిత్రం 'అభిలాష'. ఆ సినిమాలకు ఏ మాత్రం తగ్గకుండా ఉంటుంది 'అభిలాష'. కథకు తగ్గ మూడ్ తీసుకురావడంలో లోక్ సింగ్ చేసిన కృషే సినిమా సక్సస్ కు ప్రధాన కారణం.పాటల చిత్రీకరణలో కూడా ట్రెండ్ సెట్ చేసిన సినిమా 'అభిలాష'. ఇళయరాజా సంగీతం లోక్‌సింగ్ కెమేరా పనితనం, చిరంజీవి డాన్సు పోటా పోటీగా సాగిన పాటలే 'అభిలాష'లో అన్నీ. ముఖ్యంగా 'యురేకా సక్కా మిక్కా' పాట అయితే అదరగొట్టేశారు.

పాట ఇంటర్ లూడ్స్‌లో వచ్చే దృశ్యాలైతే చాలా అందంగానే కాదు.. ఆహ్లాదకరంగానూ ఉంటాయి. ఆ తర్వాత చిరంజీవితో క్రియేటివ్ కమర్షియల్స్ తీసిన అన్ని చిత్రాలూ లోక్ సింగ్ సారథ్యంలో వచ్చినవే. చిరంజీవి, కోదండరామిరెడ్డి, లోక్ సింగ్. ఈ కాంబినేషన్ లో వచ్చే సినిమాల మీద ప్రేక్షకుల్లో చాలా పెద్ద ఎక్స్ పెక్టేషన్స్ ఉండేవి. పాటల పిక్చరైజేషన్ చాలా గొప్పగా ఉండేది. 'పసివాడి ప్రాణం' సినిమాలో 'అందం శరణం గచ్ఛామి' పాటలో సుమలత ఎంత అందంగా ఉంటుందో అది తన గొప్పతనమో లోక్‌సింగ్ ప్రతిభో అర్థం కానంతగా ఉంటుందా పాట. చిరంజీవితోనే కాదు. ఇతర హీరోల సినిమాలకూ లోక్‌సింగ్ ఫొటోగ్రఫీ చేశారు. ఆఫ్‌బీట్ చిత్రాలు తీసే దర్శకుల చిత్రాలకూ పనిచేశారు. కెమేరామెన్ గా దృశ్యం తను అనుకున్నట్టు రావడానికి ఎంతటి రిస్క్ చేయడానికైనా లోక్ సింగ్ సై అనేవాడు. నిజానికి ఆ తపనే ఆయన ప్రాణం హరించింది. లోక్ సింగ్ సినిమాటోగ్రఫీ చేసిన సినిమాలు కూడా 'ఇషాన్ ఆర్య' చిత్రాల్లా బంగారు వన్నెలో మెరిసిపోతూంటాయి. సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో నవతా ఆర్ట్స్ బ్యానర్ లో వచ్చిన 'రాజు రాణి జాకి' మూవీకి లోక్ సింగే ఫొటోగ్రఫీ. అలాగే విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన 'స్వర్ణకమలం' సినిమాకూ లోక్ సింగే సినిమాటోగ్రాఫర్ గా పనిచేశారు. ఈ రెండు చిత్రాల్లోనూ లోక్‌సింగ్ ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. జంధ్యాల తీసిన 'రావూగోపాల్రావూ'కి కూడా లోక్ సింగే కెమేరా. లోక్‌సింగ్‌లో డెడికేషన్ పాళ్లు ఎక్కువ. తను తీస్తున్న దృశ్యం అనుకున్నట్టు రాకపోతే మాత్రం లోక్‌సింగ్‌కి చిర్రెత్తుకొస్తుంది. చిరంజీవి, విజయబాపినీడు కాంబినేసన్‌లో అల్లు అరవింద్ హీరో తీశారు. ఆ సినిమాలో ఓ సీన్‌లో చిరంజీవి మీదకు విలన్స్ లారీతో దాడి చేస్తారు. ఆ డ్రైవర్ తనకు కావాల్సిన రీతిలో డ్రైవ్ చేయడం లేదని చిరాకు పడ్డ లోక్‌సింగ్ కెమేరా అసిస్టెంట్‌కి ఇచ్చి తనే వెళ్లి లారీ డ్రైవ్ చేశాడు. అదీ ఆయన అంకితభావం. సరిగ్గా ఆ డెడికేషనే లోక్‌సింగ్ ప్రాణాలు బలితీసుకుంది. నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు తన కొడుకు 'భరత్' ను హీరోగా పెట్టి 'వార్నింగ్' అనే మూవీ తీశారు. దానికి లోక్ సింగ్‌కు కెమేరా బాధ్యతలు అప్పగించారు. ఓ పాట చిత్రీకరణలో హీరోయిన్ 'ఆమని' మంటల మధ్య డాన్స్ చేయాలి. ఆ మంటల కోసం ఓ కుర్రాడు పెట్రోలు పోస్తున్నాడు. తను అనుకున్నట్టు మంటలు రావడం లేదని లోక్‌సింగ్ అసహనానికి గురై తనే వెళ్లి మంటల మీద పెట్రోలు పోశాడు. ఆ పెట్రోలు పోయడంలో తను వేసుకున్న ఫుల్ హాండ్స్ షర్ట్ పెట్రోల్‌తో తడుస్తోందనీ మంటలు తనను అంటుకునే ప్రమాదం ఉందనీ ఆయనకి అనిపించలేదు. జస్ట్ సీన్ బాగా రావాలి అంతే ఆయన బుర్రలో ఉన్నది. కానీ మంటలకి ఇవేం తెలీదు కదా.. పెట్రోల్ పోసి వెనక్కొస్తున్న లోక్‌సింగ్‌ను ఒక్కసారి మంటలు కమ్ముకున్నాయి. అంతటి ప్రతిభావంతుడైన కెమేరామెన్ అందరూ చూస్తుండగా మంటల్లో ఆహుతైపోయాడు. లోక్ సింగ్ అనగానే గుర్తొచ్చే పాటల్లో 'రాక్షసుడు'లో 'మళ్లి మళ్లి ఇది రాని రోజు'.. అలాగే అలనాటి చిరంజీవి చిత్రాలు చూస్తున్న ప్రతి సందర్భంలోనూ ప్రేక్షకుల మనసుల్లో ముల్లుతో పొడుస్తున్నట్టు సన్నని బాధ. అది లోక్ సింగ్‌ను తల్చుకునే. లోక్ సింగ్ అలా అర్థాంతరంగా కన్నుమూయడం చలన చిత్ర ప్రేమికుల్ని దు:ఖసాగరంలో ముంచెత్తింది.

**- భరద్వాజ రంగావఝల**



**జమున టుడు.. ఓ గిరిజన మహిళ.. భారతదేశ అత్యున్నత పురస్కారం పద్మశ్రీ అందుకుని మహిళా సాధికారితకు సినోనిమ్ అయిన పర్యావరణ వేత్త. ఉమెన్స్‌డే అయిపోవచ్చు గాక.. కానీ, ఎప్పుడైనా చెప్పుకోవాల్సిన ఉమన్ ఆమె. ఏంటీ మరీ.. ఆ లేడీ టార్జాన్ ప్రత్యేకత..?**

నెలవైన గిరిజన తెగ కావడంతో.. అడవి పట్ల జమునకున్న భక్తికి, అక్కడి సమాజమూ తోడ్పాటందిస్తూ ఆమె ఆశయసాధనలో ముందడుగేస్తోంది.

గిరిజన రైతు కుటుంబంలో జన్మించిన టుడు.. జస్ట్ పదవ తరగతి వరకే చదువుకుంది. 1998లో ఆమె వివాహమనంతరం ఆమెకు అడవులు, చెట్ల పెంపకంపై మమకారం మొదలైంది. భర్తతో పాటు వంటచెరకుకు కావల్సిన కట్టెలు కొట్టడానికి వెళ్లినప్పుడు ఆకుపచ్చని అడవి ఆమెను ఆకట్టుకుంది. కానీ, అదే సమయంలో అంతరించిపోతున్న అడవి ఆలోచింపజేసింది. అదిగో అక్కడి నుంచి పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించింది ఒడిశాలోని రాయరంగ్ పూర్ కు చెందిన జమున టుడు.



అడవుల పరిరక్షణకు ఒక ఉద్యమబాట ఏర్పర్చుకున్న జమున.. ముందుగా తన అత్తగారి ఊరైన జార్ఖండ్ రాష్ట్రానికెళ్లాక ఓ పది మందిని పోగు చేసింది. వారందరితో కలిసి జార్ఖండ్‌లోని కలపకు ప్రసిద్ధి చెందిన అడవుల్లో మైళ్ల దూరం నడిచి.. ఎక్కడైతే అడవులు నరికివేతకు గురవుతున్నాయో ఆయా ప్రాంతాల్ని గుర్తించింది. వాన్ సురక్ష సమితి పేరిట ఫారెస్ట్ ప్రొటెక్షన్ గ్రూప్‌ను ఒకటి తయారుచేసింది. దాంతో

# అడవులే ఆమె పిల్లలు..

# మాఫియాను పారదోలిన లేడీ టార్జాన్!

జమున టుడు స్ఫూర్తితో.. జార్ఖండ్ రాష్ట్రంలోని చకులియా గ్రామంలో ఎవరింట్లోనైనా అమ్మాయి జన్మిస్తే.. ఆ కుటుంబం 18 చెట్లు నాటాలి. ఆ అమ్మాయికి పెళ్లి చేసి పంపినప్పుడు కచ్చితంగా ఓ పది చెట్లు నాటాలి. ఇదీ కండిషన్. దీంతో అమ్మాయిని, అడవినీ కాపాడుకోవాల్సిన ఒక అంతర్లీనమైన స్పృహను అక్కడి ట్రైబల్ సొసైటీలో కల్పించే ప్రయత్నానికి నాంది పలికింది జమున. చదువుకున్నవాళ్లెందరో తాగిపడేసే వాటర్ బాటిల్స్ నుంచి పర్యావరణమనే స్పృహ ఏమాత్రం లేకుండా చేస్తున్న ఎన్నో పనులు వారి నిర్లక్ష్యానికి పరాకాష్ఠ కనిపించే రోజుల్లో కేవలం ఎస్సెస్సీ చదివిన జమునలో మాత్రం ఎంత పరిణతి..?



జార్ఖండ్ రాష్ట్రంలోని ఈస్టర్న్ సింగ్ భూమ్ జిల్లాలోని మతుర్ఖమ్ అనే గ్రామం చుట్టూ 50 హెక్టార్ల అటవీభూమిని సంరక్షించి జమున టుడు రికార్డులకెక్కింది. మహిళలంటేనే మార్పుకు సంకేతమైన ఓ ప్రత్యేకమైనవారంటుంది జమున. జమున కృషితో అంతరించిపోతున్న అడవులకు రక్షణ దొరికింది. కొత్తగా అడవుల పెంపకం జరిగింది. అది పోడు వ్యవసాయంపై బతికే గిరిజనులకు ఊరటగా నిల్చింది. వారి మెరుగైన జీవన విధానానికి శ్రీకారమైంది. మొత్తంగా జార్ఖండ్ రాష్ట్రంలో అటవీ సంరక్షణలో జమున ఓ లేడీ టార్జానై నిల్చింది. అందుకే ఆమెను భారత ప్రభుత్వం 2019లో పద్మశ్రీతో సత్కరించింది.

సత్కారాలు, సన్మానాలు వాటంతటవే దక్కుతాయి. అవి రాకపోయినా ఏం పర్లేదు. కానీ, మొట్టమొదట మన ప్రయత్నాలైతే మానొద్దు. సంకల్పం తీసుకున్నాక వెనుకడుగు వేయద్దంటూ.. గిరిజనుల హక్కుల కోసం పోట్లాడుతూ.. అడవుల సంరక్షణకై పోరాడుతూ ఒక యూనిక్ లేడీగా జమున పేరు జార్ఖండ్ రాష్ట్ర అడవుల్లో ప్రతిధ్వనిస్తోందిప్పుడు.

ప్రతీ ఏడు జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్నీ ఘనంగా నిర్వహిస్తోంది జమున. చెట్లను, అడవిని తమ సొంతపిల్లల్లా భావిస్తున్న తమకు.. పర్యావరణ దినోత్సవం ఒక పండుగ అంటుంది జమున టుడు. ఆ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్ వంటి అతిథులను ఆహ్వానిస్తూ.. వారి సమక్షంలో పచ్చని భవిష్యత్తు కోసం ప్రతిజ్ఞ చేయిస్తోంది. ఆ ప్రమాణం ప్రకారమే అక్కడి సమాజమంతా బాధ్యతయుతంగా మొక్కలు నాటే క్రతువుకు బీజం వేసింది సంతాల్ కమ్యూనిటీకి చెందిన 44 ఏళ్ల జమున టుడు. జీవవైవిధ్యాన్ని కాపాడే అడవులు, చెట్లనే దేవతలుగా ఆరాధించే ఆచారాలు, సంప్రదాయలకు



అక్కడి రాష్ట్ర అటవీశాఖ దృష్టి వాన్ సురక్ష సమితిపై.. అలాగే, దాన్ని లీడ్ చేస్తున్న జమున తుడుపై పడింది. ఇప్పుడు జమున స్ఫూర్తితో వాన్ సురక్ష సమితి 500 సమూహాలుగా ఏర్పడి సుమారు పదివేల మంది అటవీ సంరక్షకులతో ఒక ఉద్యమంలా మారింది. అడవులు, వన్యప్రాణుల రక్షణే ఈ బృందాల ప్రధాన కర్తవ్యం.

అటవీశాఖగానీ, ప్రభుత్వాలుగానీ.. అడవుల పరిరక్షణలో ఎక్కడైనా చేసేది నామమాత్రమే. అందుకే ఇప్పుడు జమున దళంలోని సభ్యులంతా అడవులు నరికేవారిని అడ్డుకుంటున్నారు. పోలీస్ కంప్లైంట్స్ ఇస్తుంటారు. ఎఫ్ఐఆర్ నమోదయ్యేవరకూ పోరాడుతారు. అడవుల్లో నిరాయుధులైన అటవీశాఖ అధికారులతో పాటు, సాయుధ పోలీసులకూ పరోక్షంగా, ప్రత్యక్షంగా సాయమందిస్తున్నారు. జార?ండ్ అడవుల్లో ఎక్కడైనా పదేసి మంది మహిళలు కలిసి గస్తీ తిరిగే దృశ్యాలు కనిపిస్తే అవి కచ్చితంగా జమునా టుడు బృందాలేనంటే అతిశయోక్తి కాదు. అడవుల సంరక్షణపై విస్తృత ప్రచారం, అడవులతో కూడుకున్న పర్వతాల సంరక్షణపై అవగాహన కల్పిస్తూ ముందుకెళ్తున్న క్రమంలో జమున టుడుతో పాటు.. ఆమె నేతృత్వంలోని బృందాలకూ అటవీ మాఫియా నుంచి దాడులు, బెదిరింపులు నిత్యకృత్యం. ఒక్కమాటలో చెప్పాలంటే రోజూ సవాళ్లతో సహవాసమే. ఎప్పుడేం జరుగుతుందో తెలియని ఆందోళనే. అయినా.. తుడు బెదరదు.. వెరవదు.. అందుకే, టుడు అక్కడి లేడీ టార్జాన్.

\- బాతాఖానీ.ఇన్ సౌజన్యంతో...

# అన్నింటికీ.. మేమేనా!!

**- పెత్తనం వారిది.. చాకిరీ మాకా!**
**- కనీసం వారాంతపు విశ్రాంతి రోజు కూడా లేదా!**
**- పనిఒత్తిడితో సతమతమవుతున్న వీఆర్వోలు..**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం: గత ప్రభుత్వం కొత్తగా సచివాలయ వ్యవస్థను పెట్టి ప్రభుత్వరంగ శాఖల్లో ఆయా విభాగాలకు సంబంధించిన వారిని అన్ని సచివాలయాల్లో ఎవరు ఏ పనిచేయాలో అని నిర్ణయించి పరీక్ష పెట్టి సిబ్బందిని డిపార్ట్మెంట్కు ఒకరు చొప్పున 10 మందిని నియమించిది. ఈ పద్ధతి ప్రకారం జరుగుతున్న తరుణంలో సచివాలయ పరిధిలో ఏ పనిచేయాలన్నా తమది కానీ విభాగాల పని సైతం తమకు సిఫార్సులు చేస్తున్నారని దీనివలన తాము చేయాల్సిన వివిధ రకాలైన తమ రెవెన్యూ శాఖకు సంబంధించిన పనులతో పాటు అదనంగా ఈ పనులు చేయడం వలన కాలం సరిపోక పని ఒత్తిడితో కనీసం వారాంతపు విశ్రాంతి రోజు కూడా లేకుండా తీవ్ర బాధలకు గురవుతున్నామని వాపోతున్నారు. పైగా ఈ గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థలో అందరికీ రికార్ట్ అసిస్టెంట్ స్కేల్లో నియాకమైన ఉద్యోగులకు డీడీఓ (డ్రాయింగ్ మరియు డిస్ట్రిబ్యూటింగ్ అధికారి)గా పంచాయతీ కార్యదర్శిని పెట్టింది. అయితే అప్పటికే క్లస్టర్లో ఉన్న గ్రేడ్–1 వీఆర్వోలు సీనియర్ అసిస్టెంట్ స్కేలు దాటి ఉన్నారు. తాము మండల ఎమ్మార్వో/డీడీఓ పరిధిలో ఉన్నామని, తమకంటే జూనియర్లు అయిన సచివాలయ పంచాయతీ కార్యదర్శి తమ శాఖ కాని పనులను కూడా అంటకట్టడం ఏమిటని ప్రశ్నించుకుంటున్నారు. అలా అయితే ఒక పంచాయతీ కార్యదర్శి చేసే పనులైన పంచాయతీ సర్వేలు, పింఛన్ల పంపిణీ మా గ్రేడ్–1 వీఆర్వోలు కూడా చేస్తున్నప్పుడు, తమ రెవెన్యూ పనులైన వివిధ రకాల 53 పనులు కూడా పంచాయితీ కార్యదర్శి, మిగతా సిబ్బంది తమ పరిధిలో ఉన్న మా పనులు కూడా ఎందుకు చేయడం లేదని అడుగుతున్నారు. అసలు తమకు గ్రామీణ సచివాలయ శాఖలో తమ గ్రేడ్–1 వీఆర్వోలను గత ప్రభుత్వ ఏమైనా మెర్జ్ చేయలేదని, అలా చేసినట్లు ప్రభుత్వ అధికార ఉత్తర్వుల పత్రం లేదని అంటున్నారు.

లేని అధికారాన్ని ఒక సచివాలయ పంచాయతీ కార్యదర్శి.. గ్రేడ్–1 వీఆర్వోలపై అజమాయిషీ చేయడం తమకు చాలా ఇబ్బందులకు గురిచేస్తుందని స్థానికంగా తమ ఉన్నతాధికారుల దృష్టికి ఫిర్యాదు చేశారు. పంచాయతీ పనులు సర్వేలు, వృద్ధాప్య పింఛన్లు ప్రభుత్వ పనులు అయినప్పుడు. తమ భూసర్వే, రేషన్కార్డులు, పోలీసు డిపార్ట్మెంట్ పనులు, ఎలక్షన్ పనులు, కోర్టు కేసులు, ఇసుక అక్రమ తరలింపు , ప్రోటోకాల్ మొదలైన వివిధ తమ రెవెన్యూ శాఖ పనులు ప్రభుత్వ పనులే కాదా.. అందుకే మండల ఎమ్మార్వో పరిధిలో ఉన్న తమ గ్రేడ్–1 వీఆర్వోలను మండల స్థాయిలో వినియోగించుకుంటే.. సచివాలయంలో ఈ ఇబ్బందులు ఉండవని అంటున్నారు. దీనిపై రాష్ట్రస్థాయి తమ శాఖ ఉద్యోగ నాయకులు పలు సమావేశాల్లో చాలాదపాలు రెవెన్యూ శాఖలో పనిఒత్తిడి ఎక్కువగా ఉండటం వలన, అదనపు శాఖల విభాగాల పనులు తమ సిబ్బందికి పెట్టిందని, తమ శాఖలో ఎన్ని పనులున్నా ప్రణాళికా ప్రకారం చేస్తున్నారని తెల్పిందే అని అంటున్నారు.

# ఉచిత వైద్య శిబిరం విజయవంతం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ శ్రీకాకుళం వారి ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవో హోంలో సోమవారం జరిగిన ఉచిత మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని అసోసియేషన్ జేఏసీ చైర్మన్ చౌదరి పురుషోత్తమనాయుడు ప్రారంభించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.సోమసుందరరావు పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో జెమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ హర్ష, యూరాలజిస్ట్, డాక్టర్ మహేంద్రలు రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు జరిపి అవసరమైన చికిత్సలకు సిఫారసు చేస్తూ మందులు పంపిణీ చేశారు. జెమ్స్ ఆసుపత్రి ఏరియా మేనేజరు రవి గారి సమన్వయంతోవారి సిబ్బంది ప్రేమ, రాంబాబులు పాల్గొన్నారు. అదే విధంగా ఉష డెంటల్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కె.ఉషారాణి రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు ఉచితంగా దంత పరీక్షలు జరిపి తగు సూచనలు సలహాలు ఇచ్చి అనంతరం మందులు అందజేశారు. ఆసుపత్రి మేనేజర్ ఎస్.తులసీదేవి సమన్వయంతో వారి సిబ్బంది ఎం.నీరజాక్షి తదితరులు పాల్గొన్నారు. ఈ మెగా వైద్య శిబిరంలో సుమారు 150మంది రాష్ట్ర ప్రభుత్వ రిటైర్ఉద్యోగులు పాల్గొని వైద్య పరీక్షలు జరిపించుకుని సలహాలు సూచనలు తీసుకుని ఉచితంగా మందులు తీసుకుని సంతోషాన్ని వ్యక్తం చేశారు. చౌదరి పురుషోత్తమ నాయుడు ఆద్యంతం ఈ మెగా వైద్య శిబిరాన్ని సందర్శించారు. భవిష్యత్తులో ఈ సంఘం ద్వారా ఇంకా మంచి మెడికల్ క్యాంప్స్ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షులు ఎం.ఎస్.ఆర్.ఎస్.ప్రకాశరావు, జిల్లా సంఘ ప్రధానకార్యదర్శి పి.ఎస్.ప్రసాదరావు, కోశాధికారి కె.వెంకటేశ్వరరావు, జిల్లా సంఘ సభ్యులు పి.నరసింహమూర్తి, గణపతి ఆచారి, ఎం.లక్ష్మణరావు, బి.చిన్మయరావు, జానకిరామ్ పట్నాయక్, ఎన్.ఎస్.పండ, కె.రామ్మోహనరావు, సభ్యులు ఝాన్సీరాణి, ముత్యాలమ్మ, రాంబాయి, లక్ష్మీబాయి, అన్నపూర్ణ, నరసమ్మ, అమరేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, కాంతారావు, ఆదినారాయణ, జగ్గునాయుడు, అప్పారావు, నాగభూషణం, కోటేశ్వరరావు, అమరేశ్వరరావు, రామేశ్వరరావు, జోగారావు, సవరయ్య, బోడయ్య, రాజగోపాల్‌నాయుడు, నారన్నాయుడులు పాల్గొన్నారు.


డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# 12వ పే రివిజన్ కమిషన్‌ను నియమించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

2023 జూలై 1 నుంచి అమలుచేయాల్సిన 12వ పేరివిజన్ కమిటీ (పీఆర్సీ) కమిషన్‌ను వెంటనే నియమించాలని, పీఆర్సీ నివేదిక అందే వరకు 30 శాతం ఇంటీరియర్ రిలీఫ్ (ఐఆర్)ను జూలై 2023 నుంచి అమలయ్యేలా ప్రకటించాలని యూటీఎఫ్ సీనియర్ నాయకులు, పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ 2024 జనవరి నుంచి చెల్లించాల్సిన మూడు డిఎలను చెల్లించాలని కోరారు. హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలని, స్కూల్ అసిస్టెంట్లకు పీజీటీలుగా ప్రమోషన్లు కల్పించాలని, ప్రభుత్వ పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల సీనియార్టీ సమస్యలను పరిష్కరించి డివిజనల్ ఉప విద్యాశాఖ అధికారి, జూనియర్ లెక్చరర్, డైట్ లెక్చరర్స్ ప్రమోషన్లు కల్పించాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు అర్బన్ ఎంఈవో పోస్టులను మంజూరుచేసి ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యలు, మోడల్ స్కూల్, ఎయిడెడ్ స్కూల్ ఉపాధ్యాయుల సర్వీసు సమస్యలు పరిష్కరించాలని, కస్తూరిబా విద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ప్రిన్సిపాల్ అధ్యాపకుల ఉపాధ్యాయుల బోధనేతర సిబ్బంది సర్వీసులు రెగ్యులరైజ్ చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలో కళాశాలలో పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రైవేటు కార్పొరేటు పాఠశాలలు కళాశాలలో ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకొని విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, సామాన్య ప్రజలందరికీ సమానమైన నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలని, అప్పుడే వ్యవస్థలో ఆర్థిక అసమానతలు తొలగుతాయన్నారు. విద్యారంగ అభివృద్ధికి సరిపడా నిధులు బడ్జెట్లో కేటాయించకపోవడం సరికాదని అభిప్రాయపడ్డారు. విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసి, ప్రైవేట్, కార్పొరేట్ రంగాలకు అప్పచెపితే పేదలు విద్యకు దూరమవుతారని హెచ్చరించారు. వైద్య విద్యలో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ పేరిట వైద్యవిద్యను ప్రైవేటుకు అప్పగిస్తే సాధారణ ప్రజలు వైద్యానికి దూరమై అనారోగ్య సమాజం ఏర్పడుతుందని హెచ్చరించారు. ప్రాథమిక పాఠశాలలు అన్ని గ్రామాల్లో కొనసాగించాలని, ఆ పాఠశాలల్లో ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. సామాజిక భద్రతా పథకానికి నష్టం కలిగించే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నప్పటికీ, విద్యా రంగ సమస్యలు పరిష్కారం కాకపోవడాన్ని తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. విద్యారంగ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కలిసివచ్చే అన్ని అధ్యాపక ఉపాధ్యాయ, విద్యార్థి యువజన సంఘాలతో ఐక్య పోరాటాన్ని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని గిరిధర్ ఆ ప్రకటనలో హెచ్చరించారు.



## విద్యార్థుల తల్లిదండ్రులను 'కేశవరెడ్డి' మోసగించింది

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో కేశవరెడ్డి విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులను, విద్యార్థులను మోసగించారని శాసనసభలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రస్తావించారు. 2010లో ఈ విద్యాసంస్థ ద్వారా విద్యార్థులు చేరారని, సుమారు 800 మంది విద్యార్థులు ఈ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేశారని, అప్పట్లో ప్రతి విద్యార్థి నుంచి రూ.2 లక్షల నుంచి రూ. 8 లక్షల వరకు ఫీజుల రూపంలో వసూలు చేశారని, మొత్తం రూ.42 కోట్లు పైబడి కలెక్షన్ చేసి చేతులెత్తేసారని అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు ప్రశ్నిస్తే ప్రాంశరీ నోట్లు గాని, చెక్కులు గాని ఇస్తున్నారని, దీనిపై కేశవరెడ్డి కుమారుడు భరతరెడ్డి న్యాయం చేస్తానని చెప్పినా, ఇంతవరకు ఎటువంటి న్యాయం జరగలేదని, చాలామంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ఈ విద్యాసంస్థపై 15 కేసులు నమోదయ్యాయని, అయినప్పటికీ యాజమాన్యం విద్యార్థులకు పూర్తి అన్యాయం చేసిందని, విద్యార్థులకు, తల్లిదండ్రులకు న్యాయం చేయాలని, విద్యాశాఖ మంత్రి దీన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరారు. శ్రీకాకుళం అర్బన్ శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్లలో విద్యాసంస్థలు ఉన్నాయని, ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి దృష్టిపెట్టి విద్యార్థులకు, తల్లిదండ్రులకు న్యాయం చేయాలని, దీనిపై విద్యాశాఖ మంత్రి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

## పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

బి.కాంతారావు ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా గుడివీధిలోని డీసీఎంఎస్ షాప్ నెంబర్ 0181053, డిపో నెంబర్ 53, 81008, ఎండీయూ వాహనాన్ని పరిశీలించారు. అనంతరం డీసీఎంఎస్ గోదాం తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. అరసవిల్లి అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి రికార్డు పరిశీలించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం ప్రభుత్వం బాలికోన్నత పాఠశాలను సందర్శించి వారికి అందజేస్తున్న మధ్యాహ్న భోజన వంటకాల నాణ్యతను పరిశీలించి విద్యార్థినిలతో ముచ్చటిస్తూ ప్రతీరోజు అందజేస్తున్న ఆహారంపై ఆరాతీసి సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం రాష్ట ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ సక్రమంగా అమలు చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో సూర్యప్రకాశరావు, డీఈఓ తిరుమల చైతన్య, ఐసీడీఎస్ సీడీపీవో శోభారాణి, డిప్యూటీ డిఎంహెచ్‌వో, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, తూనికలు కొలతలు శాఖ, సీఎస్ డీటీ చక్రవర్తి, ఎండీయూ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ఈ దారి.. సిక్కోలు అభివృద్ధికి రాదారి

మొదటిపేజీ తరువాయి

రూపాయలు కూడా చేయని భూమి ఈ రోజు కోట్లుచేస్తుంది. రైతులు బాగుపడ్డారు. వాళ్ల పిల్లలకు మంచి చదువులు చెప్పించగలిగారు. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్లే దారిలో జాతీయ రహదారిలో సగం ప్రాంతమంతా ఏదో ఒక వ్యాపార వ్యవహారాలతో కళకళలాడుతూ ఉంటోంది. ప్రతి కిలోమీటర్ దూరంలో నాలుగైదు హోటల్స్ ఉంటాయి. విద్యాసంస్థలు ఉన్నాయి. రణస్థలం వరకు జాతీయ రహదారిపై సెంటు రూ.10 లక్షలకు కూడా జాగా దొరకడం లేదంటే అది కేవలం నాలుగు లైన్ల నిర్మాణం పుణ్యమే. రెండు దశాబ్దాల కిందట గుజరాతిపేట దాటిన తర్వాత బైపాస్ రోడ్డు వరకు పెద్దగా వ్యాపారాలు ఉండేవి కాదు. ఇప్పుడు ఆ ప్రాంతమంతా బిజీ రూట్ అయిపోయింది. డే అండ్ నైట్ జంక్షన్ నుంచి సింహద్వారం వరకు ఎదిగిన వ్యాపార సామ్రాజ్యాన్ని చూస్తే ఆశ్చర్యం కలగకమానదు. పదేళ్ల తర్వాత ఎవరైనా ఈ ఊళ్లో అడుగుపెట్టినట్లయితే ఆ ప్రాంతాన్ని చూసి నోరు తెరుచుకుని ఉండిపోతారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉండడం వల్ల శ్రీకాకుళానికి కలిగిన మరో ప్రయోజనం ఇది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అధ్యయనం సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ మహేందర్ దేవ్, నాలుగు లైన్ల జాతీయ రహదారి వల్ల శ్రీకాకుళానికి కలిగిన ప్రయోజనాన్ని వివరించారు. అభివృద్ధి అనేది దశదిశలా పాకుతోందని ఆయన ఈ సందర్భంగా ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. నాలుగు లైన్లు జాతీయ రహదారుల నిర్మాణం వల్ల సిక్కోలుకు జరిగిన ప్రయోజనాన్ని ప్రపంచ బ్యాంక్ ప్రముఖంగా ప్రస్తావించిందని ఆయన వివరించారు. ఇక్కడ మరో విషయం చెప్పుకోవాలి. 2019 నుంచి 2024 మధ్యకాలంలో శ్రీకాకుళం నుంచి వైజాగ్ మధ్య ఆన్‌లైన్‌లో పనులు చకచక జరిగాయి. రాష్ట్రంలో ఇప్పటికీ కొన్ని చోట్ల ఆరు లైన్లు పనులు పూర్తికాలేదు.

### ట్రాఫిక్కే మన పంట పండించింది

దేశవ్యాప్తంగా స్వర్ణచతుర్భుజి పేరిట జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించినా, విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం మాత్రం ఈమధ్య కాలంలో ఆరు లైన్లయింది. అందుకు కారణం ఈ నిర్దేశిత ప్రాంతంలో రవాణా వాహనాల రద్దీ ఎక్కువ కావడమే. అందుకే రాష్ట్రంలో మహానగరాలున్నా ఆంధ్రప్రదేశ్‌లో ఆరు వరుసల రహదారి విస్తరణను తొలుత నరసన్నపేట-విశాఖపట్నం మధ్యలో ప్రారంభించారు. రాష్ట్రంలో అత్యంత రద్దీగా ఉన్న రూటిది. రోజుకి దాదాపు 10వేల పెద్ద వాహనాలు ఈ దారిలో వెళ్తాయని విస్తరణ సర్వే చేపట్టిన ఓ సంస్థ తన అధ్యయనంలో వెల్లడించింది. అందుకే ముందుగా ఈ రహదారి విస్తరణ చేపట్టారు. ఇప్పుడు అనకాపల్లి నుంచి రాజమండ్రి మధ్య ఆన్‌లైన్ విస్తరణ ప్రారంభమైంది. ముందుగా సిక్కోలు ప్రాంతంలో విస్తరణ చేపట్టడం కూడా ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో ఉపయోగపడింది.

## సాంకేతిక విద్యాసంస్థలను ఏర్పాటు చేయండి

(సత్యంన్యూస్, పాతపట్నం)



పాతపట్నం నియోజకవర్గంలో సత్తా కలిగిన యువతీ యువకులు ఉన్నప్పటికీ టెక్నికల్ విద్య అందుబాటులో లేకపోవడంతో ఆర్థిక భారంతో సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక మధ్యలో విద్యను వదిలేస్తున్నారని, పాతపట్నం నియోజకవర్గంలో ప్రభుత్వ ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ప్రభుత్వ సాంకేతిక విద్యావ్యవస్థల ఏర్పాటు, ఆవశ్యకతపై అసెంబ్లీలో మరోసారి గళమెత్తిన ఎమ్మెల్యే మహిళలు చదువుకు అవరోధం లేకుండా ఉండేందుకు మహిళా జూనియర్, డిగ్రీ కళాశాలలను నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో చిట్టచివర ఒడిశా రాష్ట్ర సరిహద్దు కలిగిన నియోజకవర్గం కాబట్టి ఐఐటి వంటి జాతీయ విద్యాసంస్థ ఏర్పాటుచేస్తే విద్యావ్యవస్థతో పాటు నియోజకవర్గం కూడా అభివృద్ధి చెందుతుందని స్పీకర్ ద్వారా విద్యాశాఖామంత్రికి ప్రత్యేకంగా ఎమ్మెల్యే విన్నవించారు.

# జీవితం అదే.. స్క్రిప్ట్ మాత్రం ఎవడిది వాడిదే!

## అక్కడ ప్రకాష్‌రాజ్.. ఇక్కడ మారుతీరావు..



ప్రణయ్ అమృతలు ప్రేమించుకున్నారు.. పెళ్లి చేసుకుందాం అనుకున్నారు.. కులం వీలు కాదు పొమ్మంది.. మా మనసులే ఒకటయ్యాక మీ కులాలతో మాకు పనేంటి? అని పెద్దలను ఎదిరించి ఇద్దరు ఒకటయ్యారు. ఈ పెళ్లి అమృత తండ్రి మారుతీరావుకి ఇష్టం లేదు. కుల విద్వేషంతో రగిలిపోయాడు. కుర్రాడ్ని లేపేయమని రౌడీలను పురమాయించాడు. రౌడీలకి కావాల్సిన ఏర్పాట్లు చూడమని తమ్ముడు శ్రావణ్‌కు టాస్క్ ఇచ్చాడు.

వేట మొదలైంది.. రౌడీలు కుర్రాడి కోసం చెట్టూ పుట్టా గాలించడం మొదలుపెట్టారు. తండ్రి తన భర్తను లేపేయడానికి రౌడీలను పురమాయించాడని తెలుసుకున్న అమృత, ప్రణయ్‌ను తీసుకుని ఊరు విడిచిపోతుంది. ఇద్దరూ కలిసి రహస్యంగా ఓ చోట ఉంటారు. వీళ్లిద్దరూ ఉండే చోటు అమృత తండ్రి మారుతీరావు పసిగడతాడు. ప్రణయ్‌ను వేసెయ్యడానికి రౌడీలతో వెళ్తాడు. రౌడీలు అరుచుకుంటూ ఆరంగుళాల కత్తి తిప్పుకుంటూ ప్రణయ్ వైపు పరిగెత్తుకుంటూ వస్తారు. అది చూసి అమృత భయంతో గట్టిగా అరుస్తుంది. ఇంతలో హఠాత్తుగా ప్రణయ్ వైపు వెళ్లిన రౌడీ నెత్తురు కక్కుకుంటూ కింద పడిపోతాడు. మారుతీరావు ఆశ్చర్యంగా చూస్తున్నంతలోనే రౌడీలు ఒకరొకరుగా భూమిలోకి, ఆకాశంలోకి దూసుకుపోతుంటారు.

ఏం జరుగుతుందో అర్థంకాక మారుతీరావు కళ్లు నులుముకుని చూస్తుండగా రేగిన దుమ్ము వెనకనుంచి అల్లు అర్జున్ వస్తాడు. మారుతీరావు కోపంగా 'ఎవడ్రా నువ్వు?' అని అరుస్తాడు. అప్పుడు అల్లు అర్జున్ కూల్‌గా 'చూడు మామా గుండెల మీద పెట్టుకుని అల్లారుముద్దుగా పెంచిన కన్న కూతురి గుండెల్లో మంట పెట్టే అవకాశం నీకెవరిచ్చారు? పరువూ ప్రతిష్ట అంటూ ఆవేశంలో ఆ కుర్రాడ్ని వేసేస్తే నీ కూతురి భవిష్యత్తు ఏమౌతుందో ఆలోచించావా? సొసైటీలో ఏదో పెద్ద పేరుంది అనుకుంటున్న నీ భవిష్యత్తు ఏమౌతుందో ఆలోచించావా? కులం కోసం జీవితాల్లో నిప్పులు పోసుకుంటారా?

సమాజం గురించి పట్టించుకోకు మామా. నీ కూతురు కులాంతర వివాహం చేసుకుంటే మహా అయితే రెండ్రోజులు ట్రోలింగ్ వేస్తారు. తర్వాత ఎవడి పని వాడు చేసుకుంటాడు. కానీ నువ్వు గానీ ఈ కుర్రాడ్ని వేసేస్తే.. నీ కూతురు ఒంటరి అవడమే కాదు జీవితంలో ఎవడూ చేసుకోడు. ఒకవేళ చేసుకున్నా నీ వెనకున్న డబ్బును చూసి చేసుకుంటాడేమో కానీ సుఖంగా కాపురం చేయగలరా? ఎంతో పరువుగా బతికిన నువ్వు జీవితాంతం కోర్టులు, జైళ్ల చుట్టూ తిరగాల్సి ఉంటుంది. అప్పుడు నువ్వనుకుంటున్న పరువు నీకు ఉంటుందా? ఆలోచించుకో.. కూల్‌గా చెప్పాడు అల్లు అర్జున్.

మారుతీరావు వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టాడు. కూతుర్ని దగ్గరకు తీసుకుని 'అమ్మా నువ్వు పుట్టగానే మహాలక్ష్మి పుట్టిందని నేను, అమ్మా మురిసిపోయాం. నిన్ను గుండెల మీద పెట్టుకుని పెంచానమ్మా. నువ్వు ఏదడిగితే అది లేదనకుండా నీకు తెచ్చిచ్చానమ్మా. ఇన్ని చేసినవాడిని నీ మనసును తెలుసుకోలేకపోయానమ్మా. నన్ను క్షమించు. పంతులు గారితో మాట్లాడి ముహూర్తం పెట్టిస్తా. పదమ్మా ఇంటికి వెళ్దాం' అని కన్నీళ్లు తుడుచుకుంటూ అల్లు అర్జున్ వైపు చూస్తూ 'ఇంతకీ నువ్వు ఎవరు బాబూ?' అని అడుగుతాడు.

అప్పుడు అల్లు అర్జున్ సిగ్గు పడుతూ 'మీ చిన్న కూతురూ, నేనూ ప్రేమించుకుంటున్నాం.. మాదీ ఇంటర్ క్యాస్టే.. పనిలో పనిగా మా పెళ్లి కూడా చేసేయండి. ఖర్చు కూడా కలిసొస్తుంది' అనడంతో అందరూ ఆనందబాష్పాలు కార్చుకుంటూ ఒకరినొకరు హత్తుకుంటారు.



ఏంటీ స్టోరీ ఎక్కడో చూసినట్టుంది అనుకుంటున్నారా? అల్లు అర్జున్ 'పరుగు' సినిమా చూసారా? దాదాపు ఇంతే ఉంటుంది. కాకపోతే అక్కడ మారుతీరావు ప్లేసులో ప్రకాష్‌రాజ్ ఉంటాడు. స్క్రిప్ట్ మన చేతుల్లో ఉంటే జీవితాలు ఎలాగైనా తీర్చిదిద్దుకోవచ్చు.

...

కానీ స్క్రిప్ట్ మన చేతుల్లో లేకపోతే.. రియల్ స్టోరీ ఇదిగో ఇలా కింద చెప్పిన విధంగా ఉంటుంది.

ప్రణయ్ అమృతలు ప్రేమించుకుంటారు. పెళ్లి కూడా



చేసుకుందాం అనుకుంటారు. వీరి కులాంతర వివాహం అమృత తండ్రి మారుతీ రావుకి ఇష్టం లేదు. తమ్ముడికి చెప్పి రౌడీలను పురమాయించి ప్రణయ్‌ను లేపేస్తాడు. ప్రణయ్ అడ్డు తొలగిపోతే దారికి వస్తుంది అనుకున్న కూతురు తిరగబడి తండ్రి మీదే కేసు పెట్టింది. పోలీసులు మారుతీ రావును అరెస్ట్ చేసి లోపలేసారు. ఈ అవమానం భరించలేక మారుతీ రావు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆరేళ్ల విచారణ అనంతరం మారుతీ రావు తమ్ముడితో సహా మిగిలిన ముద్దాయిలకు జీవిత ఖైదు, ప్రణయ్‌ను హత్య చేసిన ముద్దాయికి ఉరిశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది.

భర్తను కోల్పోయి మారుతీరావు భార్య.. ప్రణయ్‌ను కోల్పోయి అమృత.. కొడుకును కోల్పోయి ప్రణయ్ తల్లిదండ్రులు.. జీవిత ఖైదు పడిన తండ్రిని తల్చుకుంటూ శ్రావణ్ కుటుంబ సభ్యులు ఎవరికివారు విడివిడిగా ఏడుస్తున్నారు.

ఒక వ్యక్తి చేసిన అనాలోచిత చర్య వల్ల ఇంతమంది జీవితాలు నాశనం అయ్యాయి కాబట్టి సినిమాలు వేరు, నిజ జీవితాలు వేరు. సినిమాల్లో స్క్రిప్ట్ మన చేతుల్లో ఉంటుంది. నిజజీవితంలో మన చేతుల్లో ఉండదు. ఇందుకు మారుతీ రావు జీవితమే ఓ ఉదాహరణ. కాబట్టి పరువూ ప్రతిష్ట అంటూ తొక్కలో సమాజం గురించి ఆలోచిస్తూ జీవితాలు నాశనం చేసుకోకండి.

- పరేష్ తుర్లపాటి

## గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ కమిటీల ఏర్పాటు

- జిల్లా కన్వీనర్‌గా బుడుమూరు సూర్యారావు
- శ్రీకాకుళం డివిజన్‌కు డాక్టర్ జామి భీమశంకర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం కోసం జిల్లా, డివిజన్ కన్వీనర్లను ఉద్యమ రాష్ట్ర కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ మంగళవారం ప్రకటించారు. జిల్లా కన్వీనర్‌గా విద్యావేత్త బుడుమూరు సూర్యారావును నియమించారు. ఆయన ప్రస్తుతం బూర్జ మండల ఉపాధ్యక్షునిగా ఉన్నారు. గ్రంథాలయ వ్యవస్థ పట్ల అభిమానం ఉన్నవారినే ఉద్యమ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, వారి వారి రాజకీయ కార్యకలాపాలతో తమకు సంబంధం లేదని శివప్రసాద్ స్పష్టం చేశారు. శ్రీకాకుళం రెవిన్యూ డివిజన్ కన్వీనర్‌గా విద్యావేత్త డాక్టర్ జామి భీమశంకర్‌ను, టెక్కలి డివిజన్ కన్వీనర్‌గా సీనియర్ జర్నలిస్టు బెండి నర్సింగరావును, పలాస డివిజన్ కన్వీనర్‌గా విద్యావేత్త చాపర వేణుగోపాల్‌ను నియమించారు. జిల్లా కమిటీలు డివిజన్ కన్వీనర్లు కూడా సభ్యులుగా ఉంటారు. వీరితో పాటు సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కే. శ్రీనివాస్, ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, న్యాయవాది బొడ్డేపల్లి మోహన్ రావు, విశ్రాంత లైబ్రేరియన్, జర్నలిస్ట్ దూరి గోపాలరావు, అరసం జిల్లా కార్యదర్శి చింతాడ కృష్ణారావు, విద్యావేత్త శాసనపురి మధుబాబు, ఇస్కఫ్ జిల్లా అధ్యక్షులు ఎంవి మల్లేశ్వరరావులను సభ్యులుగా ఎంపిక చేశారు. ఇది ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం కాదని, విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాలను మరింత పరిపుష్టం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవడానికి చేస్తున్న ప్రయత్నమని శివప్రసాద్ అన్నారు. గ్రంథాలయ సెస్ ద్వారా లభిస్తున్న కోట్లాది రూపాయలను, ఇతర కార్యక్రమాలకు మళ్లించకుండా, గ్రంథాలయాల అభివృద్ధికి ఖర్చు చేయాలన్నదే ఈ ఉద్యమ ధ్యేయమని చెప్పారు. గ్రంథాలయ పాఠకుల్లో, విద్యావంతుల్లో చైతన్యం తీసుకో రావడం ద్వారా, ప్రజా ప్రతినిధులకు ప్రశాంతమైన వాతావరణంలో వినతి పత్రాలు ఇవ్వడం ద్వారా, వివిధ స్థాయిల సదస్సుల ద్వారా ప్రభుత్వం గ్రంథాలయాల కోసం శ్రద్ధ తీసుకునే విధంగా ఉద్యమం కొనసాగుతుందని శివప్రసాద్ తెలిపారు. ఏప్రిల్‌లో విజయవాడలో రాష్ట్రస్థాయి సదస్సుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ ఉద్యమంలో కవులు, రచయితలు, వివిధ రంగాల మేధావులు, పుస్తక ప్రచురణ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయన్నారు. ఉద్యమాన్ని విజయవంతం చేయడానికి జిల్లా, డివిజన్ కమిటీలు మంచి దృక్పథంతో పనిచేయగలవన్న ఆశాభావాన్ని ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు, అరసం జిల్లా అధ్యక్షుడు నల్లి ధర్మారావు, కథానిలయం ప్రతినిధి దాసరి రామచంద్రరావు, శ్రీకాకుళం సాహితీ ప్రతినిధులు, కవులు కంచరాన భుజంగరావు, కలమట దాసుబాబు తదితరులు వ్యక్తం చేస్తూ, ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.